క్లుప్తంగా

నేటి నుంచి 18వ వార్డులో 'కంటి వెలుగు'

జనగామ: పట్టణంలోని 18వ వార్డు గణేష్‌వాడ యూపీఎస్ స్కూల్‌లో నేటి(శుక్రవారం) నుంచి కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు (శని, ఆది, ఇతర సెలవులు మినహాయించి) ఐదురోజుల పాటు వార్డులో కంటి పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో పార్టీ మరింత పటిష్టం

జనగామ: ఆత్మీయ సమ్మేళనంతో బీఆర్ఎస్ పార్టీ మరింత పటిష్టం కానుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి నియోజకవర్గంలో క్లస్టర్ల వారీగా ఐదు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 3, 8 తేదీల్లో పట్టణంలోని (క్లస్టర్-1, 2), 17న చేర్యాల టౌన్, 21న జనగామ రూరల్(క్లస్టర్-1), మే 5న చేర్యాల రూరల్(క్లస్టర్-2), 8న తరిగొప్పుల, 15న నర్మెట, 20న జనగామ రూరల్(క్లస్టర్-2), 23న బచ్చన్నపేట(క్లస్టర్-2) పరిధిలో ఆత్మీయ సమ్మేళనాలు ఉంటాయని చెప్పారు.

విరాళం

చిల్పూరు: సీతారామచంద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో మల్కాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి ఎమ్మెల్యే రాజయ్య రూ.2,01,116 విరాళంగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ వంశి, ఎంపీటీసీ సుధాకర్, వెన్నం రవీందర్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, అలుగు అశోక్, శ్యాంసుందర్‌రెడ్డి, వేల్పుల గట్టయ్య, సతీష్ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే సామాజిక న్యాయం

దేవరుప్పుల: ఎస్సీ వర్గీకరణతోనే ఆర్థిక, సామాజిక న్యాయం చేకూరుతుందని మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడు గోళ శోభన్‌బాబు అన్నారు. గురువారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ అధికారంలో వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మబలికి ఆచరణలో మోసం చేసిందని విమర్శించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీపీఎంలో చేరిక



జనగామ రూరల్: మండలంలోని పెంబర్తికి చెందిన సీనియర్ సీపీఎం నాయకుడు పంపర మల్లేషం వ్యక్తి గత కారణాలతో 2022 అక్టోబర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అయితే పార్టీ పద్ధతులు నచ్చకపోవడంతో తిరిగి మాతృ పార్టీ అయిన సీపీఎంలోకి వచ్చారు. ఈమేరకు ఆయనకు గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేక యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన కడకంచి రాజు (28) అనే యువకుడు మతిస్థిమితం లేక బుధవారం అదే గ్రామంలోని ఎర్రకుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మృతుడి తండ్రి గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజుకు ఏడాది క్రితం వివాహం కాగా కొంత కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి మందులు కూడా వాడుతున్నాడు. గత వారం రోజులుగా మానసిక స్థితి సరిగా లేక 29న ఎర్రకుంటలో దూకాడు. గురువారం శవం తేలడంతో సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

ధర్మసాగర్ : మల్లక్‌పల్లి గ్రామంలోని వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్ సోదరులు, వారి తల్లిదండ్రులు మణమ్మ-భద్రయ్య జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య గురువారం ప్రారంభించారు. సర్పంచ్ రాజు, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

జనగామ: కళ్లెంరోడ్డు మార్కండేయ ఆలయంలో..



జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో..



లింగాలఘణపురం: కల్యాణోత్సవం అనంతరం లక్ష్మణ సమేతంగా సీతారామ విగ్రహాలు



దేవరుప్పుల: పెద్దమడూరులో.. కల్యాణం నిర్వహిస్తున్న పూజారి శ్రీనివాసశర్మ



రఘునాథపల్లి : దొడ్డిగుట్టకు పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న సర్పంచ్ శివకుమార్ తదితరులు



అంతా రామమయం

శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు గురువారం కనులపండువగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఆలయాలు సీతారాముల నామస్మరణతో మారుమ్రోగాయి. స్వామివారి ఎదుర్కోలుతో ప్రారంభమైన ఉత్సవాలు కల్యాణంతో ముగిశాయి. అనంతరం అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జనగామ: పాతబీటుబజారులో సీతారాముల కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు


జనగామ:ఆర్టీసీ బస్టాండ్‌లో..


లింగాలఘణపురం: జీడికల్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న హైకోర్టు రిజిస్ట్రార్ సృజన, ఎమ్మెల్యే


చిల్పూరు: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య, చిల్పూరు ఆలయ చైర్మన్ దంపతులు


కొడకండ్ల: లక్ష్మక్కపల్లిలో..


జనగామ: మూలబావి సీతారామచంద్రస్వామి ఆలయంలో..


జనగామ: బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలో..


జనగామ రూరల్: వడ్లకొండలో.. సర్పంచ్ బొల్లం శారద స్వామి


నర్మెట: మచ్చుపహాడ్‌లో..


జఫర్‌గఢ్‌లో..


చిల్పూరు: లింగంపల్లిలో.. విగ్రహాలతో సర్పంచ్ తదితరులు


రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో..


బచ్చన్నపేటలో..


స్టేషన్‌ఘన్‌పూర్: శ్రీతిరుమలనాథ స్వామి ఆలయంలో..


జనగామ: గ్రెయిన్ మార్కెట్ ఆవరణలో..


చిల్పూరు: బుగులు వేంకటేశ్వర ఆలయంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు


జనగామ: శ్రీ సంతోషిమాత ఆలయంలో..


జనగామ: గణేష్ స్ట్రీట్ హనుమాన్ ఆలయంలో..


తరిగొప్పుల: అక్కరాజుపల్లిలో..


లింగాలఘణపురం: నవాబుపేటలో..

ధర్నాను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తమ్మడపల్లి (జి)లో నాయకులు, గ్రామస్తులు వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, కూలీల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదన్నారు. ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజా సంఘాల నాయకులు వడ్లకొండ రాజు, నాగరాజు, వేల్పుల రవి, గంగరాజు, గంగరాజు, ప్రభాకర్, చంద్రు, అంజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



జనగామ: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని వైశ్య రత్నాలు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. స్వామి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు మజ్జిగ అందించారు. సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యూత్ సభ్యులు

నర్మెట: తలసేమియా వ్యాధి బాధిత చిన్నారుల కోసం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ సమావేశ మందిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కాగా, రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ వారు 60 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, డాక్టర్ సత్యం, అంబేడ్కర్ యూత్ సభ్యులు పల్లె ప్రభుదాస్, ఎనుగుల వెలంగిణి,కొంపెల్లి సురేష్, చింతల కృష్ణ, సురేష్, ఎవన్ కళ్యాణ్, రమేష్, దాతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

నర్మెట: బడుగు బలహీన వర్గాల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్‌తోనే తండాలు అభివృద్ధికి నోచుకున్నాయని జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇసుకబాయితండా పరిధిలోని సంగడితండాలో రూ. 6 లక్షలు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారభించి మాట్లాడారు. సర్పంచ్ బానోత్ అనితా మంగసీయ, ఉపసర్పంచ్ హరిలాల్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లాలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన ఉపాధ్యాయుడు సంబోజు గోపాలస్వామి సంస్మరణ సభ వాల్‌పోస్టర్‌ను గురువారం నెల్లుట్లలో ఉపాధ్యాయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 23 ఏళ్ల పాటు లింగాలఘణపురం మండలంలోని ఆయా పాఠశాలల్లో పని చేసి ఇటీవలే నెల్లుట్ల బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలస్వామి మృతి చెందాడు. ఆయన జ్ఞాపకార్థం ఈ నెల 31న జనగామలో నిర్వహించే సంస్మరణ సభకు ఉపాధ్యాయులు, విద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, నిరుద్యోగ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు హాజరు కావాలని ఉపాధ్యాయ మిత్ర మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీహరి, యాదయ్య, సత్యనారాయణ, వజ్రయ్య, వేణుగోపాల్, బాలనర్సయ్య, ఉపేందర్, చంద్రయ్య కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సుగుణాకర్‌రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన వార్డు సభ్యుడు మాచర్ల రాజు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబానికి జిల్లా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు గురువారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. రాజు కుమార్తె సౌజన్య ఉన్నత చదువులకు ఆర్థికంగా సహకరిస్తానని డాక్టర్ హామీ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని స్టేషన్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడను అనుకొని విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించడం వివాదస్పదంగా మారింది. విద్యార్థులకు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. బుధవారం స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరో చోట బిగించేలా తగు చర్యలు తీసుకోవాలని విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని స్థానికులు తెలిపారు.

ఆహ్వాన పత్రం అందజేత



బచ్చన్నపేట: జిల్లా కేంద్రంలో నేడు (శుక్రవారం) బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్‌లకు నియోజకవర్గ కన్వీనర్ బక్క శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప ఆహ్వాన పత్రాన్ని అందించి గురువారం ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి మండలంలోని రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.